చంద్రబాబు పాపం పండింది

- గతంలో కోర్టులను సైతం మేనేజ్ చేసిన బాబు
- స్టేలు తెచ్చుకుంటూ విచారణకు దూరం
- పక్కా ఆధారాలతో అరెస్ట్ చేసిన సీఐడీ

టీడీపీ నేత చంద్రబాబు పాపం పండింది. ఎన్నో అవినీతి కేసుల్లో కోర్టులను సైతం మేనేజ్ చేసి, స్టేలు తెచ్చుకుంటూ విచారణ నుంచి తప్పించుకున్న చంద్రబాబు ఈ సారి అడ్డంగా దొరికిపోయాడు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగిన అవినీతిలో సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో ఆయనను అరెస్ట్ చేశారు. తమ అధినేత ఇలా దొరికిపోయే సరికి టీడీపీ శ్రేణులకు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. పక్కా ఆధారాలతో అరెస్ట్ చేయడంతో కనీసం రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలపడానికి కూడా ముఖం చాటేశారు. కొన్ని చోట్ల తూతూ మంత్రంగా రోడ్ల మీదకు వచ్చి రెండు మూడు నిమిషాలు కూర్చొని నినాదాలు చేసి వెళ్లిపోయారు.

ఎమ్మిగనూరుటౌన్: ఆర్థిక నేరగాడు చంద్రబాబుకు జైలు శిక్ష తప్పదని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేబినెట్‌నే పక్కదారి పట్టించి లేని సీమెన్స్ సంస్థతో ఒప్పందం అంటూ స్కిల్‌డెవలప్‌మెంట్ పేరుతో కోట్లాది రూపాయాలను పక్కదారి పట్టించిన అవినీతి అగ్రగణ్యుడు చంద్రబాబు అన్నారు. ఆయన చేసిన అవినీతిపై 2017 నుంచే కేంద్ర సంస్థలైన ఐటీ శాఖ, జీఎస్టీ శాఖలు చేసిన దర్యాప్తుపై ఇచ్చిన నివేదికలపై రాష్ట్ర సీఐడీ పక్కా ఆధారాలతోనే కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసిందన్నారు. ఇన్నాళ్లు న్యాయవ్యవస్థను మేనేజ్ చేస్తూ వచ్చారని, ఇక ఆయన ఆటలు సాగవన్నారు. ప్రజా ధనం దుర్వినియోగం చేసి, ప్రజాభిమానం కోల్పోయిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని, ఎక్కువ కాలం మని చేసిన ముఖ్యమంత్రిగా పేరుతెచ్చుకుని, చివరికి ఆర్థిక నేరగాడిలా ప్రజల ముందు నిలబడే దుస్థితి వచ్చిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, కౌన్సిలర్లు బజారి, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

చట్టం ముందు అందరూ సమానులే

తప్పు ఎవరు చేసినా చట్టం ముందు అందరూ సమానులే. తప్పు చేసిన వ్యక్తిని చట్టం శిక్షిస్తుంది. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు బినామీల పేరుతో అవినీతికి పాల్పడి ప్రజాధనాన్ని వృథా చేయడం చట్టరీత్యా నేరం. ఏ శిక్ష వేసినా అనుభవించక తప్పదు.

– మురళీధరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, మద్దికెర

పూర్తి ఆధారాలతోనే అరెస్ట్

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పూర్తి ఆధారాలతోనే చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇన్నాళ్లు చంద్రబాబు కుటుంబానికే రాష్ట్ర ఖజానా అంతా పోయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాలకు కోట్లాది రూపాయలు జమ చేశారు. మరి ఇన్నాళ్లు చంద్రబాబు ప్రజలకు మేలు చేయకుండా రాష్ట్ర సంపదనంతా ఏం చేశారు. దోపిడీలో బాధ్యులైన వారందరినీ అధికారులు విచారించారు.

– జిట్టా నాగేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, తుగ్గలి

అరెస్టుతో ప్రభుత్వానికి సంబంధం లేదు


మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: చంద్రబాబు అరెస్టుతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం పత్తికొండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరకడంతో పక్కా ఆధారాలతోనే సీఐడీ అరెస్ట్ చేసిందన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ స్కాం జరిగిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో సీమెన్స్ కంపెనీతో రూ.3,356 కోట్లు ఒప్పందం కుదుర్చుకున్నట్లు, ఇందులో 90 శాతం సీమెన్స్ కంపెనీ, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి పెడుతున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం ప్రచారం చేసిందన్నారు. కానీ సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ పైసా రాకుండానే, చంద్రబాబు మాత్రం అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి 5 దఫాలుగా రూ.371 కోట్లు విడుదల చేయించారన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడి తీసుకురావడంతోనే నిధులు విడుదల చేశామని ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైల్‌లో రాశారన్నారు. ఆ డబ్బు 70కి పైగా షెల్ కంపెనీల ద్వారా చేతులు మారి మళ్లీ చంద్రబాబు గ్యాంగ్ చేతుల్లోకి చేరిందన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ విచారణ చేసి స్కాంను వెలికి తీస్తే 2017లో అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడితో అధికారులు తొక్కి పెట్టారన్నారు. 2021 డిసెంబర్‌లోనే సీఐడీ కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిందన్నారు. చంద్రబాబు పాత్రపై సమగ్ర ఆధారాలు ఉన్నందునే అరెస్టు చేశారన్నారు. సమావేశంలో ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, జిల్లా నాయకుడు బాబురెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, పార్టీ మండల కన్వీనర్ కారం నాగరాజు, సర్పంచులు శ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి, రంగానాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై బస్సు జాతాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరు టౌన్: కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై అక్టోబర్ 21వ తేదీ నుంచి రాష్ట్రంలో సీపీఎం ఆధ్వర్యంలో బస్సు జాతాలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా నాయకుడు గోవిందు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అక్టోబర్ 21న ఆదోనిలో ప్రారంభమైయ్యే బస్సు జాతా రాయలసీమ జిల్లాల్లో పర్యటించి వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని వర్గాలను చైతన్యం చేయనుందన్నారు. నవంబర్ 7న విజయవాడ చేరుకుని బహిరంగ సభతో జాతా ముగుస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు హనుమంతు, రాముడు, లక్ష్మినర్సయ్య, సురేష్, కృష్ణ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ మృతి


నీలావతి (ఫైల్)

మద్దికెర: మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన మతి స్థిమితం లేని నీలావతి (45)శనివారం రైలు కింద పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో పలుమార్లు వైద్యశాలలో చూపించినా నయం కాలేదు. ఈక్రమంలో అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణులకు భోజన సదుపాయం


గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి శనివారం స్కానింగ్ పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి భోజన సదుపాయాన్ని కల్పించారు. గైనకాలజిస్టు కల్పన చేతుల మీదుగా భోజనం వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు కోటేశ్వరరావు, ఎంపీటీసీ దేవరగట్టు లక్ష్మి, నెనావత్ సరోజ, వార్డు మెంబర్లు బోడా సావిత్రి, లైట్ నాగరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గణపతి, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన


పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం గ్రంథాలయ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్ మాట్లాడుతూ హిందీ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 వరకు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మృతి

తుగ్గలి: ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మీటేతండాకు చెందిన రమావత్ లక్ష్మిబాయి (55) అనారోగ్యంతో మృతి చెందారు. కాన్సర్‌వ్యాధితో బాధపడుతున్న ఆమెకు రెండేళ్ల క్రితం ఆపరేషన్ చేయించారు. అయినా కోలుకోలేక శనివారం మృతి చెందింది. 2014లో ఆమె టీడీపీ తరఫున ఉప్పర్లపల్లి ఎంపీటీసీ స్థానం నుంచి గెలుపొందారు. లక్ష్మిబాయికి నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యం రవాణాదారుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ


ఆదోని రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, కారు సీజ్ చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ శనివారం తెలిపారు. మండలంలోని పెద్దపెండేకల్ గ్రామంలోని హనుమప్పగుడి క్రాస్ వద్ద ఇస్వీ గ్రామానికి చెందిన పి.ఉశేన్‌సాబ్, పెండేకల్‌కి చెందిన ఎం.గోపాల్, కామవరం గ్రామానికి చెందిన హమీద్, హోల్వికి చెందిన ఖాసీం కారులో 40 బాక్సుల ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా పట్టుబడ్డారన్నారు. వారిని అరెస్టు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.దాడుల్లో సెబ్ ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, శివప్రసాద్, పీసీలు సోమేష్, శ్రీనివాస్, రోహిన్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని పెరవలి శ్రీరంగనాథ స్వామి ఆలయంలో రూ.68 లక్షలతో తూర్పు, దక్షిణ మూడు అంతస్తుల రెండు రాజగోపురాల నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం మన ధర్మమన్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ దస్తగిరి గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పార్వతికొండ శివాలయంలో..



పత్తికొండటౌన్: శ్రావణమాసం ఆరుద్ర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పార్వతికొండపై వెలసిన శివాలయంలో రుద్రహోమం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు బీటీ ఈరన్న, భక్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, బాబురెడ్డి పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌లో 1910 కేసులు పరిష్కారం



కేసులు విచారిస్తున్న జడ్జి దివ్య, ఎమ్మిగనూరు లోక్ అదాలత్‌లో కేసులు విచారిస్తున్న జడ్జి గురుఅరవింద్

పత్తికొండటౌన్: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో జూనియర్ సివిల్‌జడ్జి వి.దివ్య 1910 కేసులను పరిష్కరించినట్లు లోక్‌అదాలత్ క్లర్క్ రమాదేవి తెలిపారు. పెట్టీ కేసులు–1729, క్రిమినల్ కేసులు–79, సివిల్ కేసులు–16, ఎంసీ కేసులు–2, డీవీసీ కేసు–1, ఇసుక అక్రమ రవాణా కేసులు–31, ఎస్‌టీసీ కేసులు–48, బ్యాంకు కేసులు–5 ఉన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ మురళీమోహన్, లోక్‌అదాలత్ సభ్యుడు రమేష్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

- ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 1,161 కేసులకు జడ్జి కె.గురుఅరవింద్ పరిష్కారం చూపారు. మెగా లోక్‌అదాలత్‌లో బార్ అసోసియేషన్ న్యాయవాదులు లక్ష్మినారాయణరెడ్డి, రఘురాం, కుమార్, శ్రీకాంత్, ఏసేపు, మహబుబ్‌బాష,సాలమాన్, రంగనాథ్, సురేష్,రామమూర్తి ల్గొన్నారు.
- వెల్దుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని 23 కేసులకు శనివారం డోన్‌లో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం లభించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు


కృష్ణుని ఊరేగింపులో ఆకట్టుకున్న కోలాటం


భక్తుల మధ్య స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ప్రబోధ సేవా సమితి–ఇందు జ్ఞాన వేదికల గ్రామ కమిటీ సభ్యులు గ్రామంలో ఆరడగుల కృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు చేశారు. అందులో భాగంగా స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామవీధుల గుండా అశేష భక్త జనం మధ్య ఊరేగించారు. బాలికల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీఈశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యులు తలారి కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందురాజులు, పురుషోత్తం, శంకరయ్య, మాజీ సర్పంచ్‌లు నాగన్న, కృష్ణయ్య, కమిటీ సభ్యులు రామాంజనేయులు, గంగాధర్, మల్లికార్జున, శ్రీరాములు, మాధవకృష్ణలు పాల్గొన్నారు. సాయంత్రం కార్యక్రమంలో స్వామి వారు వెళ్లే దిశను బట్టి పంటలు పండే విధానం తెలుస్తుండటంతో కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపు ముందు నందికోల సేవ ఘనంగా చేపట్టారు. ఉత్సవం సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ

ఆస్పరి: జగన్న భూ రక్ష భూసర్వే పథకంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని శంకరబండ, తురువగల్లు గ్రామాల్లో మండల జెడ్పీటీసీ దొరబాబు సమక్షంలో ఈఓఆర్డీ నరసింహా రెడ్డి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోవర్ధన్, మండల కన్వీనర్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

పత్తికొండ రూరల్: పులికొండ గ్రామానికి చెందిన పింజరి గౌస్(47) పాముకాటుతో శనివారం మృతి చెందాడు. గ్రామంలోని వామిదొడ్డి వద్ద పడుకుని ఉన్న గౌస్ అస్వస్థతకు గురైనట్లు ఉదయాన్నే గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా వైద్యుడి సలహామేరకు కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అంజన్నకు గ్రామోత్సవం


పెద్దాంజనేయస్వామి గ్రామోత్సవం


ఆంజనేయస్వామి ఉత్సవానికి గుర్రంతో కొండపైకి వెళ్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్: శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా స్థానిక పాతపేటలోని పెద్దాంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పెనుమాడలో..

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో వెలసిన అభయహస్త ఆంజనేయస్వామికి శ్రావణ మాస చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండలపైకి అశ్వంతో వెళ్లి అక్కడ స్వామికి పూజలు నిర్వహించారు. కొండపైన ఉన్న ధనలయ్య స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాత్రి స్వామి ఉత్సవ విగ్రహాన్ని వీధుల గుండా ఊరేగించారు. అలాగే కంబాలపాడు, ఆగవేళి గ్రామాల్లో కూడా ఆంజనేయస్వామి గ్రామోత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

హంప గ్రామంలో..

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో శనివారం శ్రావణమాసం సందర్భంగా ప్రసన్నవరదాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఆలయంలో ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం అన్నదాన చేశారు.

హోళగుందలో..

హోళగుంద: శ్రావణ మాసం నాలుగ శనివారం సందర్భంగా హోళగుందలోని అగ్ర ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకు పూజ, కుంకుమార్చన, దీప నైవేద్యములను సమర్పించారు.

నేటి నుంచి వైఎస్ఆర్‌సీపీ మండల స్థాయి సమావేశాలు


రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నేటి నుంచి మండల స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య తెలిపారు. మండల, గ్రామ నాయకులతో వైఎస్ఆర్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సమావేశమవుతారన్నారు. శనివారం కర్నూలు వచ్చిన రీజినల్ కోఆర్డినేటర్‌తో బీవై రామయ్య కలిసి సమావేశాల నిర్వహణపై సమీక్షించారు. 10వ తేదీన గోనెగండ్ల, 11న నందవరం, 12న ఎమ్మిగనూరు మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులతో నేరుగా రీజినల్ కోఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా నాయకులు సమావేశమై క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

నేటి నుంచి పార్టీ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ పర్యటన

ఎమ్మిగనూరుటౌన్: నియోకవర్గంలోని గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం మండలాల్లో శనివారం నుంచి వైఎస్సాసీపీ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిలు పర్యటించనున్నట్లు పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు.

రమణీయం.. గుంటి రంగస్వామి రథోత్సవం



గుంటిరంగస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్) పూజలందుకున్న ఉత్సవమూర్తులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ శివారులోని వెంకటాపురంలో శనివారం సాయంత్రం గుంటిరంగస్వామి మహారథోత్సవం కడురమణీయంగా సాగింది. పట్టణంలోని శ్రీరామస్వామి ఆలయం నుంచి స్వామివారిని పల్లకీలో వెంకటాపురం వరకు తీసుకెళ్లి గుంటిరంగస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహలతో కొలవుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంలో కొలువుంచి భక్తులు గోవింద నామస్మరణతో ముందుకు లాగారు. కార్యక్రమంలో గుంటిరంగస్వామి ఆలయ ధర్మకర్తలు నీలకంఠరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగన్న, 28వ వార్డు కౌన్సిలర్ బజారి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు


స్కానింగ్ పరీక్షల కోసం పేర్ల నమోదుకు బారులు తీరిన గర్భిణులు

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, కోసిగి మండలాల నుంచి దాదాపు 320 మంది గర్భిణులు హాజరైనట్లు సూపరింటెండెంట్ డాక్టరు మైత్రేయి తెలిపారు. ప్రతి గర్భిణికి స్కానింగ్ పరీక్షలు చేస్తామన్నారు. డాక్టరు మైత్రేయితో పాటు డాక్టర్ ఫాతీమా తదితరులు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అన్నదానం

ప్రభుత్వాసుపత్రికి స్కానింగ్ పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులు కరీముల్లా, ప్రసాద్, హరి, రాజన్న, రాజశేఖర్, నంది శ్రీను, కృష్ణారెడ్డి, రవి, శ్యామ్, రాములు పాల్గొన్నారు.

పడిపోయిన కూరగాయల ధరలు

- ఆందోళనలో అన్నదాతలు


టమాట మొక్కలను తొలగిస్తున్న రైతులు

దేవనకొండ: కూరగాయల ధరలు పూర్తిగా పడిపోయవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కూలీల ఖర్చులు కూడా రావడంలేదని వాపోతున్నారు. మండలంలో ఎక్కువగా టమాట, మిర్చి, గోరుచిక్కుడు, వంకాయ తదితర పంటలను రైతులు సాగుచేశారు. మూడు వారాల క్రితం రైతులను మురిపించిన కూరగాయ ధరలు.. ఒక్కసారిగా పాతాళానికి పడిపోవడంతో రైతులు చితికిపోతున్నారు. టమాట కిలో రూపాయి, గోరుచిక్కుడు 25 కేజీల బస్తా రూ.30 ధర పలుకుతుండడంతో రైతులు పొలాల్లోనే కోతలు కోయకుండా వదిలేస్తున్నారు. మరికొందరు వాటిని పొలాల్లోనే పీకేసి వదిలేస్తున్నారు. కుంకనూరు గ్రామంలో రైతు రామాంజనేయులు రెండు ఎకరాల్లో గోరుచిక్కుడు పంటను సాగుచేశాడు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున దాదాపు రూ.40 వేలు పెట్టుబడి పెట్టాడు. ఇప్పుడున్న ధర కూలీలు తెంచడానికి కూడా రానంతగా పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇక పలువురు రైతుల టమాట మొక్కలు కూడా తొలగించుకుంటున్నారు.